విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

- మంథని సీఐ రాజు
- శ్రీపాదకాలనీలో కార్డన్‌సెర్చ్


మాట్లాడుతున్న సీఐ రాజు

మంథని: విద్యార్థులు గొడవలకు దూరంగా ఉండాలని, ఉన్నత లక్ష్యంతో చదివి ఉద్యోగాలు సాధించాలని మంథని సీఐ రాజు సూచించారు. మున్సిపల్ పరిధిలోని శ్రీపాదకాలనీలో శనివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. కాలనీవాసులతో సమావేశమై పలు సూచనలు చేశారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, సేవించినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని సుమారు 50 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు గుర్తించినట్లు తెలిపారు. మంథని, రామగిరి, ముత్తారం ఎస్సైలు రమేశ్, చంద్రకుమార్, నరేశ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మకాలనీలో కార్డన్‌సెర్చ్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఐవోసీ ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి అంతర్గాం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ఇంటింటికెళ్లి ద్విచక్ర వాహనాలు, ఇతరత్రా వాహనాలను కూడలిలోకి చేర్చుకుంటూ కాలనీవాసులకు వివిధ అంశాలపై పలు సూచనలు, సలహాలిచ్చారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు నమ్మొద్దని, అనవసరమైన అంశాలపై స్పందించకూడదన్నారు. అనంతరం వాహనాల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి పత్రాలు లేని వారికి కౌన్సెలింగ్ ఇచ్చి సత్వరమే పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, అంతర్గాం, రామగుండం ఎస్సైలు బోయ వెంకటస్వామి, గుండేటి సంధ్యారాణి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

సైబర్ మోసాలపై అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళాబృందం

ఫెర్టిలైజర్‌సిటీ: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలకుర్తి మండలం ఎల్కలపల్లి గ్రామంలో శనివారం ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో పోలీస్ కళాబృందం సైబర్ నేరాలు, మత్తు పదార్థాలతో అనర్థాలపై అవగాహన కల్పించారు. రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచితులు ఫోన్ చేసినప్పుడు వ్యక్తిగత వివరాలు, బ్యాంక్, ఆధార్ సంబంధించిన ఓటీపీలు ఎవరితో పంచుకోకూడదని సూచించారు. యువత మత్తు పదార్థాలు, గంజాయికి బానిసై భవిష్యత్ నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. గ్రామంలో అపరిచితులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపిక


అభినందిస్తున్న చైర్మన్ సంజీవ్‌కుమార్

సుల్తానాబాద్: కరీంనగర్ జిల్లాలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన అండర్–14 బాలుర సెపక్ తక్రా పోటీల్లో ప్రతిభ కనబరచిన ఇండియన్ పబ్లిక్ పాఠశాల 6వ తరగతి విద్యార్థి ఎం.కళ్యాణ్ గుణాకర్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సత్యం తెలిపారు. డిసెంబర్ 1, 2వ తేదీల్లో కామారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీల్లో కల్యాణ్ పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థిని పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ అభినందించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, ఇక్బాల్, శివ, సతీశ్ పాల్గొన్నారు.

టీచర్‌కు సన్మానం



ఎలిగేడు: మండల విద్యావనరుల కేంద్రంలో లాలపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న గౌరిశెట్టి పుష్పలత ఉద్యోగ విరమణ సన్మాన సభ శనివారం నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలు ఆమెను సత్కరించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం గంద్ర దేవేందర్‌రావు, సీఆర్పీలు లక్ష్మీనారాయణ, శ్వేత పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక రాబడి


మొక్కలు నాటిన సీఈవో, రైతులు

సుల్తానాబాద్‌రూరల్: ఆయిల్‌పాం సాగుతో రైతులు అధిక రాబడి పొందవచ్చని తిరుమల ఆయిల్ కం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సీఈవో కేశు కాళ్యాంకర్ అన్నారు. సుల్తానాబాద్ మండలం నీరుకుల్లలో రైతు ఎర్రబెల్లి మోహన్‌రావు వ్యవసాయ క్షేత్రంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆయిల్ మొక్కలు నాటారు. ఒక్కసారి పంట సాగు చేస్తే 30ఏళ్ల పాటు పంట వస్తుందని, త్వరలోనే కాల్వ శ్రీరాంపూర్ మండలం పెద్దరాత్‌పల్లిలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీధర్, మహేశ్ పాల్గొన్నారు.

వ్యాయామం తప్పనిసరి

మంథని: విద్యార్థులు ప్రతీనిత్యం వ్యాయామం చేయాలని మంథని గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీనాథ్ సూచించారు. మంథని విద్యాలయంలో శనివారం విద్యార్థులతో చేత ఏరోబిక్ వ్యాయామం చేయించారు. శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశం ఉందని, వ్యాయామం ఆరోగ్యానికి ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. పీడీ రమేశ్, పీఈటీ పుష్పలత ఉన్నారు.

సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ

రామగుండం: హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించే మాలల సింహగర్జన సభకు సంబంధించిన పోస్టర్‌ను అంతర్గాం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. మాల మహానాడు యూత్ నాయకుడు కందుగుల కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం నిర్వహించే మాలల గర్జనకు అత్యధికంగా తరలిరావాలని కోరారు. మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, బొడ్డు లింగమూర్తి, గాదం శ్రీనివాస్, వేల్పుల సాంబయ్య, తీగుట్ల నవీన్, గుమ్మడి పోశం ఉన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి

ఎలిగేడు: జిల్లా కేంద్రంలో డిసెంబర్ 4న జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు కోరారు. సీఎం సభకు జన సమీకరణపై కాల్వశ్రీరాంపూర్ కాంగ్రెస్ ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే తన స్వగ్రామం శివపల్లిలో శనివారం సమీక్షించారు. సభకు పెద్దఎత్తున ప్రజలను తరలించాలని సూచించారు. కాల్వశ్రీరాంపూర్ కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలి

సుల్తానాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే విజయరమణారావు సూచించారు. గర్రెపల్లి జెడ్పీ హైస్కూల్‌లో శనివారం బాలశక్తి మెగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే పోటీలను ప్రారంభించి మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమల్‌రావు, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేశోరాం కాంట్రాక్టు కార్మికులకు పదోన్నతి


నియామక పత్రాలు అందజేస్తున్న యూనియన్ నాయకులు, అధికారులు

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో కాంట్రాక్ట్ బేసిక్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న 42మందికి పర్మినెంట్ కార్మికులుగా పదోన్నతి పొందారు. కాగా శనివారం వారికి నియామక పత్రాలు అందజేశారు. కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ పార్థసారథి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దాడి మహేశ్ పదోన్నతి పొందిన కార్మికులకు ఆర్డర్ లెటర్లు ఇచ్చారు. హెచ్‌ఆర్ అధికారులు సదానందం, శ్యాంకుమార్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ప్రసాద్, రమేశ్, నారాయణ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


పాలకుర్తి: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పాలకుర్తి: మండలంలోని పుట్నూర్ గ్రామ రైతువేదిక ప్రాంగణంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చిత్రపటాలకు స్థానిక కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు తోట ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగాధర రమేశ్, పార్టీ మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు మాదాసు శ్రావణ్, సాగర్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సుల్తానాబాద్: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని పీఏసీఎస్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు సంబరాల్లో భాగంగా శనివారం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యదర్శి సంతోష్‌కుమార్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• కుష్టుపై అవగాహన

ఎలిగేడు: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఎల్‌సీడీసీ–లెప్రసీ కేసు డిటెన్ క్యాంపెయిన్‌పై మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా అవగాహన కల్పించారు. కుష్టు వ్యాధి సోకే విధానం, దాని లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. డిసెంబర్ 2 నుంచి 15వ తేదీవరకు క్యాంపెయిన్‌లో భాగంగా ఇంటింటా ఆశా కార్యకర్త స్క్రీనింగ్ చేస్తారని, ప్రజలు సహకరించాలని కోరారు. డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని అవగాహన ర్యాలీ చేపట్టారు.

• మృతుల కుటుంబాలకు పరామర్శ

పాలకుర్తి: మండలంలోని కుక్కలగూడుర్ గ్రామానికి చెందిన నల్లపు అవినాశ్, కుదిరె సాగర్, బడుగు సాగర్ కుటుంబాలను శనివారం రామగుండం ఎమ్మెల్యే సతీమణి, మక్కాన్‌సింగ్ సేవాసమితి అధ్యక్షురాలు మనాలీఠాకూర్ పరామర్శించారు. ఇటీవల వెల్గటూర్ మండలం స్తంభంపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మనాలీఠాకూర్ అవినాష్ కుటుంబానికి రూ.5వేలు, మిగతా ఇద్దరు యువకుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శ్రీపతి శంకరయ్య, నాయకులు తోట ప్రశాంత్, శ్రీపతి సురేశ్, మేరుగు ఉదయ్, మేడం మల్లయ్య ఉన్నారు.

• ప్రజాపాలన దరఖాస్తులకు ఎడిట్ అవకాశం కల్పించాలి

మంథని: సీఎం రేవంత్ సర్కార్ చేపట్టిన ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వాటిలో అనేక తప్పిదాలు చోటుచేసుకున్నందున, వాటిని సవరించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పోతరవేని క్రాంతికుమార్ కోరారు. డాటా ఎంట్రీలో జరిగిన తప్పిదాల మూలంగా ఎంతో మంది నిరుపేద ప్రజలకు ప్రభుత్వం ప్రకటించిన పథకాలకు అర్హత లేకుండా పోతుందన్నారు. ప్రజాపాలన దరఖాస్తులకు సంబంధించిన వెబ్‌సైట్ పునరుద్ధరించి ఎడిట్ ఆప్షన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

• కొండచిలువ హతం

సుల్తానాబాద్: పట్టణంలోని నీరుకుల్ల రోడ్డులో కొండచిలువ వాహనదారులకు అడ్డంగా రావడంతో స్థానికులు కొండచిలువను గమనించి కొట్టి చంపివేశారు. కొండచిలువ కాలనీలోకి రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.

• విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వ చెలగాటం

సుల్తానాబాద్: ఏడాది గడవక ముందే 51మంది విద్యార్థుల ప్రాణాలు తీసుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్ ఆరోపించారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్, విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ రాసూరి ప్రవీణ్, నగర కార్యదర్శి మెడుగు సిద్ధార్థ, నాయకులు వినయ్, ఆశిష్, గణేశ్, నవదీప్ పాల్గొన్నారు.

• కార్మికశాఖ అధికారిని నియమించాలి

సుల్తానాబాద్‌రూరల్: పెద్దపల్లి జిల్లాగా ఏర్పడి 8ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు కార్మికశాఖ అధికారిని నియమించలేదని, వెంటనే నియమించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు కోరారు. పెద్దపల్లిలోని సీఐటీయూ కార్యక్రమంలో శనివారం సమావేశం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షులు బిక్షపతి, సహాయ కార్యదర్శి రామాచారి, సీపెల్లి రవీందర్ ఉన్నారు.

• శ్రీమద్భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని శ్రీఆదివరాహ స్వామి ఆలయ కళ్యాణ మండపంలో శనివారం గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు శ్రీమద్భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని శ్లోక కంఠస్థం, పారాయణం చేసి వినిపించారు. విద్యార్థులకు ఏంఈవో విజయ్‌కుమార్ బహుమతులు అందజేశారు. గీతా ప్రచార సమితి సభ్యులు వేపూరి రాములు, కాస సత్యనారాయణ, బాలయ్య, బర్ల శంకర్ పాల్గొన్నారు.

• బీఆర్‌ఎస్ నాయకుల రాస్తారోకో

ధర్మారం: సాంఘిక సంక్షేమ గురుకులం విద్యాలయం సందర్శనకు వస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అడ్డుకున్నందుకు నిరసిస్తూ ధర్మారం మండలం మల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకులం విద్యాలయం ఎదుట శనివారం బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ గురుకులం సందర్శనకు రాకుండా మార్గమధ్యంలోనే పోలీసులు అడ్డుకోవడంతో ధర్మారం బీఆర్‌ఎస్ నాయకులు మల్లాపూర్ గురుకులం విద్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా ప్రిన్సిపాల్ అనుమతించలేదు. దీంతో ఆగ్రహించిన నాయకులు గురుకులం ఎదుటనే బైఠాయించి రాస్తారోకో చేశారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై శీలం లక్ష్మణ్ సంఘటన స్థలానికి చేరుకుని రాస్తారోకో విరమింపజేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, మేడారం సింగిల్‌విండో చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కూరపాటి శ్రీనివాస్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు అజ్మీర మల్లేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

• మేరీ సేవలు అభినందనీయం

రామగిరి: విద్యార్థుల ఔన్నతికోసం పాటుపడిన అల్లం లూర్దు మేరీ సేవలు అభినందనీయమని హెచ్‌ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జినుక మల్లేశ్ అన్నారు. బేగంపేట ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిర్వహించిన హెచ్‌ఎం మేరీ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆమెను సన్మానించారు.

ఉద్యోగ విరమణ ఎస్సైకి సన్మానం


సన్మానిస్తున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: ఉద్యోగ విరమణ పొందిన ఎస్సై ఫరీద్‌ను సీపీ ఎం.శ్రీనివాస్ శనివారం సన్మానించారు. సీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫరీద్‌ను సీపీ సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. అదనపు డీసీపీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ సుందర్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే గంజాయి కట్టడి

సుల్తానాబాద్‌రూరల్: అందరి సమష్టి కృషితోనే గంజాయి, డ్రగ్స్ కట్టడి చేయొచ్చని యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ (టీజీఏఎన్‌బీ) సందీప్ శాండిల్య అన్నారు. పెద్దపల్లిలోని ట్రినిటి డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం కల్పించడంతో పాటు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ నీతారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అశ్విని సరిత ఉన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా, 8వకాలనీ సింగరేణి పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని జనరల్ మేనేజర్ (ఈఈ అండ్ సీఎస్‌ఆర్) కార్పొరేట్ కొత్తగూడెం శ్రీబెర్నాడెట్ నికోలస్ ఆదేశించారు. పాఠశాలను శనివారం ఆయన సందర్శించి స్థానికంగా నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు. విద్యార్థులకు గుణాత్మకతతో కూడిన నాణ్యమైన విద్యాబోధన చేయాలని, సీబీఎస్‌ఈ సిలబస్‌కు సంబంధించి నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. డీజీఎం(పర్సనల్) అనిల్‌కుమార్, డీజీఎం(సివిల్) ధనుంజయ్, పాఠశాల హెచ్‌ఎం.సుందర్‌రావు, జేఈ సివిల్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

బదిలీ హెడ్ కానిస్టేబుళ్లకు సన్మానం


సన్మానిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరిఖని: గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. బదిలీ అయిన హెడ్‌కానిస్టేబుళ్లు మాచర్ల వేణు, నర్సింగ్, రామ్మూర్తి, హేమసుందర్‌ను సీఐ ఇంద్రసేనారెడ్డి సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు.

బర్మా, కాందీశీకుల సమస్యలు పరిష్కరించాలి

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని టెక్స్‌టైల్ భూముల్లో ప్రతిపాదిత విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్రం సమాలోచనలు చేస్తున్న విషయం తెలిసిందే. అంతర్గాం బర్మా, కాందీశీకుల సంక్షేమ సంఘం ప్రతినిధి ఇండిబిల్లి రవీందర్ శనివారం ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. తమ భూముల్లో ఏ పరిశ్రమ స్థాపించినా తమకు ప్రత్యేక ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ విమానాశ్రయం ప్రక్రియ ప్రారంభానికి ముందే సమావేశం నిర్వహించి భూములపై ఉన్న లిటిగేషన్లు పరిష్కరించేందుకు సమష్టిగా కృషిచేద్దామన్నారు.

సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల నిరసన

మంథని: తమని రెగ్యులరైజ్ చేయాలని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు శనివారం మంథని మండల వనరుల కేంద్రం ఎదుట భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు వెంటనే పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఆర్పీల జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి మల్లన్న, జేఏసీ మండల అధ్యక్షురాలు కొత్త వద్ల సుప్రజ, ఐఈఆర్పీలు శ్రీనివాస్, సౌజన్య, సీఆర్‌పీలు రాధిక, స్వప్న, సీసీవో శ్రీనివాస్, పీటీఐలు వీరేశం, ధనుంజయ్, కృష్ణ, చంద్రమౌళి, మెస్సెంజర్ ఓదెలు ఉన్నారు.

రైతుల కళ్లలో ఆనందం చూడటమే లక్ష్యం

మంథని: రైతులకు ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చి రైతుల కళ్లలో ఆనందం చూడటమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మంథని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శనివారం రైతు పండుగ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సంఘం సిబ్బంది, రైతులు, పాల్గొన్నారు.



జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి ఆరు నెలలు గడిచినా విద్యుత్‌శాఖ విభాగం వారు తీగలు బిగించడం మరిచారు. విద్యుత్ స్తంభానికి తీగలు ఏర్పాటు చేస్తే సమీపంలోని నివాసమున్న వారు విద్యుత్ కనెక్షన్లు తీసుకోవడానికి అవకాశాలు ఉన్నాయి. స్తంభానికి లైటు బిగిస్తే రాత్రి వెళ్లే వారికి దారి కనిపిస్తుంది. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ తీగలతో పాటు లైటు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

ఉద్యోగ విరమణ సన్మానం


సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 జీఎం కార్యాలయంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన రాజశేఖర్, ఏరియా సర్వే అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ప్రభాకర్‌ను శనివారం సన్మానించారు. జీఎం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరిని సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్, సేఫ్టీ జీఎం గుప్తా, క్వాలిటీ జీఎం భైద్యా, ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలు ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న జీఎం ఎన్.సుధాకర్‌రావు

రామగిరి: కంపెనీ స్థాయి అథ్లెటిక్స్, త్రోబాల్, స్విమ్మింగ్ పోటీలు ఘనంగా నిర్వహించాలని ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు అన్నారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం క్రీడాకారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్జీ–3, ఏపీఏ వర్క్‌పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 10, 11వ తేదీల్లో సెంటినరికాలనీ రాణిరుద్రమ దేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహించే కంపెనీ స్థాయి అథ్లెటిక్స్, త్రోబాల్, స్విమ్మింగ్ పోటీలు విజయవంతం చేయాలన్నారు. క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని పెంచుకుని ఏరియాకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల ప్రతినిధులు ఎం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, అధికారులు జి.రఘుపతి, వై.వి.శేఖర్‌బాబు, రాజేంద్రకుమార్, బి.సుదర్శనం, కోల శ్రీనివాస్, గౌరవ కార్యదర్శి సునీల్ ప్రసాద్, క్లబ్ సెక్రటరీ బెల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రాజెక్టు అధికారికి సన్మానం


రమేశ్‌ను సన్మానిస్తున్న జీఎంలు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం రీజియన్‌లోని ఎస్‌ఎంఎస్ ప్లాంట్ ప్రాజెక్టు అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఎస్.రమేశ్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. ఎస్‌ఎంఎస్ ప్లాంట్ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రమేశ్‌ను సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, రీజియన్ సేఫ్టీ జీఎం గుప్తా, ఎక్స్‌ప్లోజివ్ జీఎం డి.భైద్యా, ఏపీఏ ప్రాజెక్టు అధికారి నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న జీఎం, ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని: ఏరియాలోని కార్మికుల సమస్యలు యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్జీ–1 జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శనివారం జీఎం లలిత్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన స్ట్రక్చరల్ సమావేశంలో వారు మాట్లాడారు. జీడీకే–5 ఓసీపీలో ఫిట్టర్లు, ఎలక్ట్రీషియన్లు మజ్దూర్ల సంఖ్య పెంచాలన్నారు. ఏరియా వర్క్‌షాప్‌లో టిండాల్ ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. జీడీకే–11గనిలో మ్యాన్ రైడింగ్ ఏర్పాటు చేయాలన్నారు. రీజనల్ అనాలిటికల్ ల్యాబ్‌లో పైకప్పు పెచ్చులు కూలుతున్నాయని, వాటిని వెంటనే మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. ఏరియా ఆసుపత్రిలో స్టాఫ్‌నర్సులు, పారామెడికల్ సిబ్బంది, స్కావెంజర్లు, జనరల్ మజ్దూర్ల సంఖ్య పెంచాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, సెంట్రల్ సెక్రటరీ స్వామి, బ్రాంచ్ సెక్రటరీ అరెల్లి పోషం పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ప్రాజెక్టు స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యవర్గం ఎన్నిక


గనేశ్వర్ జడ్డీ


అశోక్ ధీరే

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీగా గనేశ్వర్ జడ్డీ, జాయింట్ సెక్రటరీగా శుభం అశోక్ ధీరెలు ఎన్నికల్లో విజయం సాధించారు. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్ మహాత్మాగాంధీ క్రీడా మైదానంలోని స్టేడియం హాలులో శనివారం జరిగిన స్పోర్ట్స్ కౌన్సిల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. విజయం సాధించిన కార్యవర్గానికి ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, మణికంఠ, మహేశ్, సువర్ణన్‌రావు అభినందనలు తెలిపారు.

కౌన్సిల్ కార్యవర్గం

ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యవర్గం నియామకమైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా పేరాల రాజేశ్, కార్యదర్శిగా గనేశ్వర్ జడ్డీ, జాయింట్ సెక్రటరీగా శుభం అశోక్ ధీరే, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వినోద్ కుమార్, కుమార్ సమల్, తోతారాం చౌదరి, ఆశిష్, సత్యనారాయణ ఎంపికయ్యారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా :
9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
పెద్దపల్లి : కె.తిరుపతి, ACO - 7997958206
పెద్దపల్లి : ఎం.మహేందర్, SR - 9573331940
మంథని : రాజేశ్ - 9676603963
రామగుండం : ప్రశాంత్ - 9652397696
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899